ప్రజారోగ్యంపై సీఎం ప్రత్యేక దృష్టి

- జగనన్న పాలనలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- ఉచిత గుండె జబ్బుల వైద్య శిబిరానికి విశేష స్పందన
- ముందస్తు జాగ్రత్తలతో గుండె పదిలమన్న వైద్యులు


వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డాక్టర్ దుర్గాప్రసాద్‌రావు


వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ...ప్రజారోగ్యంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చి సెంటర్ నిర్వహణలో శనివారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కార్డియాలజి హెల్త్‌క్యాంపునకు విశేషస్పందన లభించింది. నియోజకవర్గవ్యాప్తంగా 723 మంది వైద్యపరీక్షలకు తమ పేర్లు నమోదు చేసుకోగా..515 మందికి 2డి ఎకో, ఈసీజీ పరీక్షలు చేశారు. 124 మందిని తదుపరి చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా వైద్యశిబిరంకు సంబంధించి ఏర్పాట్లను చేయడమే కాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వైద్యచికిత్సలు అందరికీ అందేలా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్రంలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్ విధానాన్ని అమలుచేసేందుకు, ఇంటివద్దకే వైద్యసేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్స్, అర్బన్‌హెల్త్ క్లినిక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలికవసతులను మెరుగుపరచడమే కాకుండా పూర్తిస్థాయిలో వైద్యులను నియమించారన్నారు. పేదవాడి వైద్యానికి ఒక రూపాయి ఖర్చుచేయనవసరం లేకుండా ఆరోగ్యశ్రీ పరిధిలోకి మూడువేలకు పైగా జబ్బులను చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. మదనపల్లెలో ప్రజలు గుండెజబ్బుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు, జబ్బుల నిర్ధారణకు వైదేహి హాస్పిటల్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్ట్, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. దీనికి సహకరించిన వైదేహి హాస్పిటల్ హెడ్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్ డాక్టర్.దుర్గాప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ దుశ్శాలువతో సత్కరించారు. వైదేహి సీనియర్ హార్ట్ నిపుణులు డాక్టర్.దుర్గాప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉరుకుల, పరుగుల జీవితంలో శారీరక, మానసిక ఒత్తిడి సహజంగా మారిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో గుండెపై పడే ఒత్తిడిని అధిగమించేందుకు శ్రద్ధ వహించాల్సి ఉందన్నారు. వ్యాయామం, సమయానికి ఆహారం తీసుకోవడం తప్పనిసరి అన్నారు. గుండెకు సంబంధించిన విషయాలు, వ్యాధులపై అవగాహన పెంచుకోవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చన్నారు. 40 ఏళ్ల పైబడిన, షుగర్ వ్యాధులున్న ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి గుండె చెకప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరుఫీ, షరీఫ్, మునిశేఖర్, బావాజీ, ఎల్ఐసీ.సుధాకర్, జాన్‌బాబు, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఎస్వీ.రమణ, పాల్‌చంద్రశేఖర్, వసీం, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ


గాయపడిన అల్లాబక్షు


షౌకత్‌అలీ

మదనపల్లె : స్థలవివాదంలో ఇరువర్గాలు ఘర్షణ పడి ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో చోటుచేసుకుంది.. నీరుగట్టువారిపల్లెకు చెందిన అల్లాబక్షు(45) కురబలకోట మండలం సర్కారుతోపుకు చెందిన షౌకత్‌అలీ(35)కి స్థలం అద్దెకు ఇచ్చాడు. ఇటీవల తన స్థలం ఖాళీచేయాల్సిందిగా కోరి మూడునెలల సమయం ఇచ్చాడు. అయితే అద్దెకు ఉన్న షౌకత్‌అలీ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలం తనదేనని, తాను ఖాళీ చేయాలంటే రూ.6లక్షల నగదు ఇవ్వాలని అల్లాబక్షును డిమాండ్ చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు శనివారం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఇందులో భాగంగా మరోసారి ఇద్దరి మధ్య వివాదం రేగడంతో ఘర్షణ జరిగింది. గొడవలో అల్లాబక్షు తీవ్రంగా గాయపడగా, షౌకత్‌అలీ స్వల్పంగా గాయపడ్డాడు. బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ మరోసారి ఇరువర్గాలు ఘర్షణ పడి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పది లీటర్ల సారా స్వాధీనం

పీలేరు రూరల్ : పది లీటర్ల సారా తోపాటు ఓ నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని మొరవవడ్డిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన టి.యర్రయ్య సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది యోగానంద, రాఘవయ్య, సుధాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రగతి పథంలో నడిపించాలి

– ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు



అంగళ్లులో హెడ్మాస్టర్ల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కురబలకోట : ఒక వ్యవస్థను కాని పార్టీని కాని సమర్థవంతంగా నడిపించేవాడే నాయకుడు. హెడ్మాస్టర్లు కూడా స్కూళ్లను ప్రగతి పథంలో నడిపించాలని ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. నాయకత్వ లక్షణాలపై అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో వరుసగా జరుగుతున్న హెడ్మాస్టర్ల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల బలోపేతానికి అంకిత భావంతో పని చేయాలన్నారు. టీచర్లను, తల్లిదండ్రులను సమన్వయపరచి వారి సహకారంతో పాఠశాలను ప్రగతి పథంలో నడిపించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. వారి భావి భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. బాధ్యతగా యుతంగా పనిచేసి సత్ఫలితాలను సాధించాలన్నారు. ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

30 మంది టీడీపీ నాయకుల ముందస్తు అరెస్ట్ : డీఎస్పీ


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అదుపులో ఉన్న టీడీపీ నాయకులు

మదనపల్లె : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సీఐడీ పోలీసులు అరెస్ట్‌చేసిన నేపథ్యంలో అల్లర్లకు పాల్పడవచ్చనే అనుమానంతో మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో 30 మంది టీడీపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..చంద్రబాబునాయుడు అరెస్ట్ సందర్భంగా టీడీపీ నాయకులు అల్లర్లకు పాల్పడటం, ఆస్తులు ధ్వంసం చేయడం, ప్రజారవాణాకు ఆటంకం కల్గించడం, విధ్వంసం సృష్టించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించడంతో ముందస్తు అరెస్టులు చేశామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లలో ఉంచుకుని స్వంతపూచీకత్తుపై హామీ పత్రం రాయించుకుని విడుదల చేయనున్నట్లు తెలిపారు. అయితే టీడీపీ నాయకులు దొమ్మలపాటియశస్విరాజ్, చాణుక్యతేజ, నాదెండ్ల అరుణ్‌తేజ, ఎస్.ఏ.మస్తాన్, షోయబ్‌శీను, దేవరింటి శీన తదితరులు పోలీసుల కళ్లుగప్పి మార్కెట్ యార్డు, బెంగళూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నిరసన వ్యక్తంచేశారు. టీడీపీ మహిళా నాయకులు నాగమణి, హసీనా తదితరులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి


రుణాలపై అవగాహన కల్పిస్తున్న సింగల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్

వాల్మీకిపురం : వాల్మీకిపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సింగల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రాయల్ కోరారు. శనివారం పట్టణంలోని రైతులకు, ఖాతాదారులకు ఆయన సిబ్బందితో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గోల్డ్ లోన్లు, వ్యవసాయ రుణాలు విరివిగా అందిస్తున్నామని, ఫిక్స్‌డ్ డిపాజిట్ల సౌకర్యం ఉందన్నారు. డైరెక్టర్ నరసింహా రెడ్డి, సీఈవో కుమార్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

గ్రూప్ 1,2 పోస్టులను భర్తీచేయాలి

రాయచోటి అర్బన్: ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1 లో 500, గ్రూప్–2లో ఖాళీగా ఉన్న 2500 పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయకార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని డైట్ పాఠశాలలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రూప్–1లో 89, గ్రూప్‌లో 508 పోస్టుల భర్తీకి మాత్రమే ఆర్థికశాఖ ఆమోదం తెల్పడం దారుణమన్నారు.

గ్రామ వికాసానికి పాటుపడాలి

జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి


అంగళ్లులో కార్యదర్శుల ముగింపు సమావేశంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

కురబలకోట : గ్రామ కార్యదర్శులు సమగ్ర గ్రామ వికాసానికి పాటుపడాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఆరు రోజులుగా అంగళ్లు గోల్డన్ వ్యాలీ కళాశాలలో జిల్లా స్థాయిలో గ్రామ కార్యదర్శులకు జరిగిన రెండో బ్యాచ్ రెసిడెన్సియల్ శిక్షణ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పూర్తి అవగాహన ఉన్నప్పుడే పరిపాలన సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయ ద్వారా అనేక సేవలు అందుతున్నాయన్నారు. గ్రామంలో మూల స్తంభాలుగా కార్యదర్శులు పని చేయాలన్నారు. ప్రజలు గుర్తించేలా విధి నిర్వహణలో కార్యదర్శులలో కొత్తదనం కన్పించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలన్నారు. అంకిత భావంతో ఆపై బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పదవీ విరమణ చెందే వరకు కూడా ప్రజలకు మేలు చేసే విధంగా పని చేయాలన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులపై అవగాహనతో ముందుకు సాగాలన్నారు. డీఎల్‌పీఓ నాగరాజు, గోల్డన్‌వ్యాలీ కళాశాల నిర్వాహకులు ఎన్వీ రమణారెడ్డి, మాస్టర్ ట్రైనర్లు ఎస్. అబ్దుల్ సుకూర్, ఎస్. నవాజ్, కె. శేషగిరికుమార్, బి. రాజశేఖర్ నాయక్, ఎస్.గఫూర్, ఎస్. గిరిధర్, పద్మారాణి, రెడ్డెప్ప, బయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన గ్రామ కార్యదర్శులకు డీపీఓ, డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

రాజీమార్గమే రాజమార్గం


పీలేరులో జాతీయ లోక్‌అదాలత్

పీలేరు రూరల్ : కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులు ఇరు వర్గాల అభిప్రాయం మేరకు కేసులు పరిష్కరించుకుని ఇరు వర్గాలు సంతోషంగా వెళ్లాలన్నారు. శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చి పలు కేసులు పరిష్కారం చేసినటుల్ జడ్జి తెలిపారు. పీలేరులో 280 కేసులు పరిష్కారమైతే రూ. 1,45,19,730 రికవరీ అయినట్లు జడ్జి తెలిపారు.

వాల్మీకిపురంలో 116 కేసులు పరిష్కారం

వాల్మీకిపురంలో 116 కేసులు పరిష్కారం కాగా రూ. 18,48, 998 రికవరీ అయినట్లు వాల్మీకిపురం ఇన్‌చార్జి అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తెలిపారు. క్రిమినల్ కేసులు 52, సివిల్ కేసులు 8, జరిమానాలు 56 కేసులు పరిష్కారం అయినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రఫీ అన్సారీ, న్యాయవాదులు చిన్నరెడ్డెప్ప, సీఐ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి : వాల్మీకిపురం కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో కలికిరి పోలీస్ స్టేషన్‌కు సంబంధించి మొత్తం 32 కేసులు రాజీ కుదిరినట్లు ఎస్ఐ కే.రహీముల్లా తెలిపారు. వీటిలో 16ఐపీసీ, 16 పిట్టి కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో 319 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో నిర్వహిస్తున్న జడ్జి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ అధ్యక్షతన శనివారం జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్ గురించి కక్షిదారులకు వివరించారు. అనంతరం కక్షిదారులు సమ్మతి మేరకు 319 కేసులు పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.21,09,399 రికవరీ చేసినట్లు తెలిపారు. వైద్య విధానపరిషత్ డాక్టర్ పావని ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి పలువురికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగమల్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సిద్దలింగారెడ్డి, హసన్‌వల్లి, పోలీసు అధికారులు, బాలలహక్కుల ఐక్యవేదిక కన్వీనర్ నరసింహులు, లోక్‌అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో గెవితిమ్మరాయస్వామి

రామసముద్రం : శ్రావణమాసం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు శ్రావణమాసం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిన్నిపల్లె సమీపంలో ఉన్న గెవితిమ్మరాయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు రావడంతో కొండ గోవిందనామస్మరణతో మారుమోగింది. భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. అలాగే పలువురు ఆటోల్లో భక్తులను ఉచితంగా తరలించారు. మోరు కొండపై ఉన్న స్వామివారి శిల స్థూపాన్ని దర్శించుకున్నారు. మల్లెల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే ప్రతి సంవత్సరం కొండపై వెలసిన గెవితిమ్మరాయస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అన్నదానం చేయడం ఆనవాయితీ. అలాగే మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీజనార్దనస్వామి ఆలయం, చెంబకూరులోని గట్టువెంకటేశ్వరస్వామి ఆలయం, తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కులశేఖర్‌బట్టర్, అనిల్ స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారిని జెడ్పీటీసీ సిహెచ్ రామచంద్రారెడ్డి, కొండూరు శ్రీనాథరెడ్డి , నరేంద్ర, తిమ్మయ్య తదితరులు దర్శించుకొన్నారు.

అంజన్నకు పుష్పయాగం

రాజంపేట టౌన్: పట్టణంలో దేవదాయశాఖ పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ భక్తబృందం ప్రతినిధి వర్దిబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని ఘనంగా పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారికి పుష్పయాగం కార్యక్రమానికి ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలను, ఆంజనేయ స్వామి ప్రతిమను భక్తులు పురువీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు పుష్పాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరినాథ్‌శర్మ ఆధ్వర్యంలో పురోహితులు వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు.



చట్టం ఎవరికీ చుట్టం కాదు

- తప్పుచేస్తే ఎంతటివారైనా శిక్ష అనుభవించాల్సిందే
- న్యాయం ఎప్పటికైనా గెలుస్తుంది
- ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడిందనడం అన్యాయం

మదనపల్లె : ప్రజాధనానికి కాపలా కాయాల్సిన కాపలాదారులే దోపిడీదారులయితే... చట్టం తమకు చుట్టమని, తమను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగితే...నిబంధనలు, చట్టం లేకుండా నియమాలను బేఖాతరు చేస్తూ.. చట్టానికి దొరక్కుండా అవినీతికి పాల్పడితే... ఏదో ఒకరోజు తప్పకుండా దానికి ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. సరిగ్గా అలాంటిదే... మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జరిగింది. ఈడీ, సీఐడీ స్పష్టమైన ఆధారాలతో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నకిలీ ఇన్‌వాయిస్‌లతో షెల్ కంపెనీలకు రూ.371 కోట్ల నిధులను మళ్లించారని దర్యాప్తులో నిర్ధారించుకున్నాకే శనివారం అరెస్ట్ చేశారు. దీన్ని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా రాజకీయ కుట్రగా వర్ణిస్తూ రాద్ధాంతం చేస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తూ.. బాబును సచ్ఛీలుడిగా నిరూపించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

నిజాయితీ కోర్టులో నిరూపించుకోవాలి



దేశంలో ఎవరిని అరెస్ట్ చేసినా రాజ్యాంగబద్ధంగా, చట్టప్రకారంగా జరుగుతాయి. చట్టానికి ఎవరూ అతీతులు కారు. అవినీతికి పాల్పడిన వారు, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షించబడాల్సిందే. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తన పాత్ర లేదనుకున్నప్పుడు చంద్రబాబు తన నిజాయితీని కోర్టులో నిరూపించుకోవచ్చు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా దోపిడీకి, అవినీతికి పాల్పడితే జరిగే పరిణామాలు ఇలాగే ఉంటాయి.

– జీవీ.ప్రసాద్, రిటైర్డ్ హెచ్ఎం, మదనపల్లె

స్పష్టమైన ఆధారాలతోనే అరెస్టు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ విషయంలో ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడిందనడం మంచి పద్ధతి కాదు. చంద్రబాబు ప్రభుత్వంలో.. ఆయన హయాంలో జరిగిన కుంభకోణానికి సంబంధించి ఈడీ, సీఐడీ అధికారులు స్పష్టమైన ఆధారాలతో ముందస్తు నోటీసులు ఇచ్చాకే అరెస్ట్ చేశారనే విషయం తెలుస్తోంది. గతంలో జరిగిన స్కాంలో కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థలు మాజీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తే దానికి ఎవరినో దోషులుగా ప్రకటించడం తగదు. ఆయన తప్పు చేయలేదని భావిస్తే న్యాయస్థానంలో ఆధారాలు సమర్పించి నిర్దోషిగా బయటకు రావచ్చు.

– రమేష్, కొండయ్యగారిపల్లె, నిమ్మనపల్లె మండలం

తప్పు చేయకపోతే భయపడాల్సిన పనిలేదు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పు చేయకపోతే అరెస్ట్‌కు భయపడాల్సిన అవసరం లేదు. తన వద్ద అన్ని ఆధారాలు ఉంటే న్యాయస్థానంలో సమర్పించి కేసును కొట్టివేయించుకోవచ్చు. ఏదైనా కేసులో అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేయడం, కోర్టులో హాజరుపరచడం, తప్పు లేదని తేలితే నిర్దోషులుగా ప్రకటించడం సాధారణంగా జరిగే విషయమే. ముఖ్యమంత్రికైనా..సామాన్యుడికైనా ఒకే చట్టం. ఇందులో రాద్ధాంతం చేయాల్సిన విషయమే లేదు.

– యమలా సుదర్శనం, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు, మదనపల్లె

చట్టం తన పనిచేసుకుపోతుంది



ప్రజాస్వామ్యదేశంలో చట్టం, న్యాయవ్యవస్థలు తమ పని తాము చేసుకుపోతాయి. అధికారంలో ఎవరున్నా అదే రాజ్యాంగం.. అదే చట్టం అమల్లో ఉంటుంది. రాజ్యాంగాన్ని అతిక్రమిస్తే ఎవరికైనా శిక్ష తప్పదు. చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన స్కిల్ కుంభకోణంలో అవినీతి జరగలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆయనపైనే ఉంది. తప్పు జరగలేదని నమ్మకం, ధీమా ఉన్నప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవచ్చు.

– కోనేటి దివాకర్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు, మదనపల్లె

చట్టం దృష్టిలో అందరూ సమానులే



అవినీతికి పాల్పడిన వ్యక్తి ఎంతటి వారైన చట్టం దృష్టిలో అందరూ సమానులే. చంద్రబాబు నాయుడు అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర ప్రజల సొమ్మును కాజేయడం సమంజసం కాదు. స్కిల్ డెవలప్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన చంద్రబాబు శిక్షార్హుడే.

– రమణ, దళితనాయకులు, కోళ్లఫారం, పీలేరు


ప్రజల సొమ్ము కాజేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి



రాష్ట్ర ప్రజల సొమ్ము కాజేసిన వ్యక్తులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి. సీనియర్ నాయకుడు అయిన చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అవినీతికి పాల్పడడం హేయమైన చర్య. సీఐడీ అధికారులు సమగ్ర విచారణతో చంద్రబాబు అవినీతి వెలికి తీయడం అభినందనీయం.

– అంబికాపతి ఆచారి, పీలేరు


చంద్రబాబు అవినీతిలో ఆరితేరాడు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతిలో ఆరితేరాడు. 14 ఏళ్ల ముఖ్యమంత్రి అని చెప్పుకునే ఆయన ప్రజల సొమ్ము కాజేస్తూ విదేశాల్లో దాచుకుంటున్నారు. ఆయన అవినీతి అన్ని రంగాల్లోనూ ఉంది. ఆయనపై మరింత లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

– బోదేషావలి, ఆటో యూనియన్ నాయకుడు, పీలేరు

ప్రజలసొమ్ము తింటే దేవుడుకూడా క్షమించడు



రాష్ట్ర ప్రజల సొమ్ము తింటే దేవుడు కూడా క్షమించడు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి ఇలాంటి అవినీతికి పాల్పడడం దుర్మార్గం. ఇలాంటి అవినీతి పరుల్ని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. అవినీతిపరులపై తీసుకునే చర్యలు మిగిలిన వారికి కనువిప్పు కలిగేలా ఉండాలి.

– గడిబాషా, మైనారిటీ నాయకులు, పీలేరు

వడివడిగా ఫోర్‘వే’ పనులు


అంగళ్లు వద్ద గోల్డన్ వ్యాలీ మార్గంలో చేపట్టిన బైపాస్ రోడ్డు పనులు


చేనేతనగర్-మదనపల్లె మార్గంలో శరవేగంగా ఫోర్‌వే పనులు

- భూ నిర్వాసితులు, బాధితులకు పరిహారం చెల్లింపు
- గడువులోగా పూర్తి చేయాలన్నదే లక్ష్యం

కురబలకోట : ములకలచెరువు నుంచి మదనపల్లె పట్టణం తట్టివారిపల్లె వరకు 41 కిలోమీటర్ల ఫోర్‌వే ఎన్‌హెచ్–42 పనులు వడివడిగా సాగుతున్నాయి. ఇందుకు రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో కేంద్రం రూ.480 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ మార్గంలో కురబలకోట మండలంలోని చేనేతనగర్, అమ్మచెరువు మిట్ట వద్ద రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో వైపు దొమ్మన్న బావి నుంచి గోల్డన్‌వ్యాలీ కళాశాల మీదుగా బైపాస్ రోడ్డు పనులు కూడా జోరందుకున్నాయి. బురకాయలకోట బైపాస్ రోడ్డు పనులు ఆఖరి దశలో ఉన్నాయి. ఇప్పటికే భూములు కోల్పోయిన నిర్వాసితులకు, నివాసాలు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను కూడా మారుస్తున్నారు. చేనేతనగర్‌లో కంకర వేశారు. అమ్మచెరువు మిట్ట వద్ద రోడ్డుకు మట్టి వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో వైపు రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు నిర్మిస్తున్నారు. మలుపులు చక్కగా చేస్తున్నారు. అమ్మ చెరువు మిట్ట వద్ద దశాబ్దాలుగా ఉన్న ప్రమాదకర మలుపు బాధ లేకుండా నేరుగా రోడ్డు వేస్తున్నారు. దీంతో ఏళ్లుగా ప్రమాదాల పిలుపుగా ఉన్న అమ్మ చెరువు మిట్ట కష్టాలు వాహనదారులకు తొలగనున్నాయి. అలాగే ఎత్తు పల్లాలను చక్కదిద్దుతున్నారు. అంగళ్లు దగ్గరున్న విశ్వం కళాశాల ముందు బైపాస్ సర్కిల్ ఏర్పాటు చేయనున్నారు. అక్కడ నుంచి మదనపల్లె తట్టివారిపల్లె సర్కిల్ వరకు ఈ రోడ్డు వేయనున్నారు. ఈ పనులు పూర్తయితే అంగళ్లుపై చాలా మట్టుకు ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది. ఇదివరలో వివిధ సందర్భాల్లో పలు మార్లు అంగళ్లులో ట్రాఫిక్ స్తంభించింది. ఇక మీదట ఇలాంటి సమస్యలు తలెత్తవు. రాష్ట్ర, అంతర్రాష్ట్ర సర్వీసులు, భారీ వాహనాలు, ఇతర ట్రాన్స్‌పోర్టు వాహనాలతో పాటు తిరుపతి, అనంతపురం, మదనపల్లె, చిత్తూరు, కడపకు రాకపోకలు సాగించే వాహనాలు కూడా నేరుగా బైపాస్‌పై వెళతాయి. ఇదిలా ఉండగా 2025 జనవరి వరకు ఈ రోడ్డు పనులు పూర్తి చేయడానికి గడువు ఉంది. అయితే కాంట్రాక్టర్ వచ్చే ఏడాది జూన్‌కు పనులు పూర్తి చేయాలన్న పట్టుదలతో రాత్రింబవళ్లు శరవేగంగా పనులు గావిస్తున్నారు. హైవే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులు పర్యవేక్షిస్తున్నట్లు డీఈ శివరాం తెలిపారు.